APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం

దేవి నవరాత్రుల్లో 5వ రోజు



మహాలక్ష్మీదేవి అలంకారం

సంపుటి : 1 | సంచిక : 24 | ఒంగోలు | శుక్రవారం 26-9-2025 | ఎడిటర్ : కుమార్ | పబ్లిషర్ : నరాల మురళి | పేజీలు : 4 | వెల : రూ. 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar

## పెట్టుబడులు పెట్టాలని మోదీ పిలుపు

### ప్రభుత్వ పథకాలతో ఆహార ఎగుమతులు 20రెట్లు పెరిగాయి



## ఉత్తరాది రాష్ట్రాలకు సింధూ జలాలు

### 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి ప్రాజెక్టు సిద్ధం!

### దీని వ్యయం దాదాపు రూ.4వేల నుంచి రూ.5 వేల కోట్లుగా అధికారులు అంచనా



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** సింధూ నదీ వ్యవస్థలో భారీ మార్పులకు కేంద్రం సిద్ధమైంది. పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందం నిలిపివేసిన తర్వాత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తరాది రాష్ట్రాల నీటి డిమాండ్‌ను తీర్చేందుకు ఓ భారీ ప్రాజెక్టు

మిగతా 2లో

## వెనుకబడిన వర్గాల కోసం 'మోస్ట్ బ్యాక్‌వర్డ్ జస్టిస్ మేనిఫెస్టో

### బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ రాహుల్ గాంధీ కీలక ప్రకటన



**బిహార్ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మోస్ట్ బ్యాక్‌వర్డ్ జస్టిస్ మేనిఫెస్టో విడుదల చేశారు. వెనుకబడిన వర్గాలను బలోపేతం చేయడం, వారి భాగస్వామ్యాన్ని పెంచడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'బీజేపీ అబద్ధాలు చెబుతోంది. దారి మళ్లించే కుట్రలు చేస్తోంది. కాంగ్రెస్ మాత్రం వెనుకబడిన, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు

మిగతా 2లో



## నిరుద్యోగులు ప్రిపేర్ అవుతూ ఉండాలి

# ప్రతి ఏడాది డీఎస్సీ

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** 'ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుంది. నిరుద్యోగులు ప్రిపేర్ అవుతూ ఉండండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే పెట్టానని గుర్తు చేశారు. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై 15,941 మంది మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. టీచర్లుగా నియామక పత్రాలు తీసుకున్న అందరిని సీఎం అభినందించారు. అవినీతి లేకుండా పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టి టీచర్ల నియామకం చేపట్టామని వెల్లడించారు. 'బాబు ష్యూరిటీ – జాబు గ్యారెంటీ' అని చెప్పి దాన్ని నిజం చేస్తున్నామని అన్నారు. రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నామని త్వరలో 10 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని తెలిపారు.

**14 సార్లు డీఎస్సీ – 1,96,619 ఉద్యోగాలు :** 15 ఏళ్లల్లో 14 సార్లు డీఎస్సీని పెట్టి 1,96,619 ఉద్యోగాలిచ్చామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. 'ఏపీలో ఓ చేతకాని పక్షం ఉంది మంచి చేయరు, మంచి జరుగుతుంటే ఓర్వలేరు' అని మండిపడ్డారు. డీఎస్సీని అడ్డుకునేందుకు 106 కేసులు వేశారని కానీ ఇబ్బందులను అధిగమించి లోకేశ్ డీఎస్సీని నిర్వహించారని అభినందించారు. మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తెచ్చామని, సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందని వెల్లడించారు. ప్రధాని సూపర్ జీఎస్టీ తెచ్చి ధరలు తగ్గించారని అన్నారు. పోస్టింగుల కోసం పైరవీలు చేసే పరిస్థితి గతంలో ఉండేది కానీ టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే పోస్టింగులు ఇచ్చామని తెలిపారు.

**టీచర్ల బదిలీలు పారదర్శకంగా :** విద్యా రంగంలో సంస్కరణలు తెస్తున్నామని, సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్నభోజనం అందిస్తున్నామని సీఎం అన్నారు. పేరెంట్ టీచర్లు మీటింగులు నిర్వహిస్తున్నాం, మన బడి–మన భవిష్యత్ పేరుతో మౌలిక సదుపాయాల కల్పన చేపడుతున్నామని తెలిపారు. టీచర్ల బదిలీల చట్టంతో పారదర్శకంగా

మిగతా 2లో

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** అమరావతిలో జరిగిన మెగా డీఎస్సీ నియామక పత్రాల అందజేత కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. సుమారు 15,941 మంది విజేతలకు నియామక పత్రాలు అందజేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ మెగా డీఎస్సీని మెగా హిట్‌గా నిలిపిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. 150 రోజుల్లోనే కేసులు ఎదురైనా విజయవంతం: "డీఎస్సీపై 106 కేసులు వేశారు. అయినా కేవలం 150 రోజుల్లోనే నియామక పత్రాలు అందించగలిగాం. ఇది కూటమి ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం" అని లోకేశ్ అన్నారు. ప్రతీ ఏటా డీఎస్సీ తప్పనిసరిగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. నవంబర్‌లో టెట్ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రకటించారు. సీబీఎన్ అంటే డీఎస్సీ – డీఎస్సీ అంటే సీబీఎన్: "ఆంధ్రప్రదేశ్‌లో 15 డీఎస్సీలు జరిగితే అందులో 14 టీడీపీ హయాంలోనే జరిగాయి. ఇప్పటివరకు 2 లక్షల మందికి పైగా టీచర్లను నియమించిన ఘనత మా పార్టీదే. అందుకే సీబీఎన్ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే సీబీఎన్" అని లోకేశ్ వ్యాఖ్యానించారు. యువగళం పాదయాత్ర సమయంలో నిరుద్యోగ యువతతో కలిసినప్పుడు డీఎస్సీ హామీ ఇచ్చామని, అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేశారని గుర్తు చేశారు.

**తనపై ప్రభావం చూపిన గురువులు:** ఈ సందర్భంగా నారా లోకేశ్ తన విద్యా ప్రస్థానం గురించి కూడా ప్రస్తావించారు. "పదో తరగతి వరకు నేను నామమాత్రంగా చదివేవాడిని. కానీ నన్ను తీర్చిదిద్దిన నలుగురు గురువులు ఉన్నారు. నారాయణ నాకు ఫండమెంటల్స్‌లో బలం ఇచ్చారు. అమెరికాలో ప్రొఫెసర్ రాజిరెడ్డి విద్యా వ్యవస్థపై అమూల్యమైన సూచనలు చేశారు. వీరి వల్లే నేను ఇవాళ మీ ముందు నిల్చున్నాను. జీవితకాల గురువు అంటే మా సీఎం చంద్రబాబు" అని అన్నారు.

**ఉత్తమ ఉపాధ్యులను ప్రోత్సహించే ఆలోచన:** లోకేశ్ మాట్లాడుతూ "మన దేశంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, ఫిన్లాండ్, సింగపూర్ వంటి దేశాలకు పంపి వారి విద్యా విధానాలను అధ్యయనం చేయించేలా సీఎం గారిని కోరాను. ప్రపంచానికి ఆదర్శంగా నిలిచేలా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్?ను చూపిద్దాం" అని తెలిపారు. విజేతలతో ముఖాముఖి: అంతకుముందు ఉపాధ్యాయులతో జరిగిన

మిగతా 2లో

## పాలస్తీనాపై మోదీ సర్కార్ మౌనం సరికాదు

### మానవత్వం, నైతికతను వదిలేశారు!: సోనియా



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** పాలస్తీనా అంశంపై మోదీ సర్కారు గాఢమైన మౌనం మానవత్వం, నైతికతలకు తిలోదకాలు ఇచ్చేలా ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ మండిపడ్డారు. దీనిపై భారత్ నాయకత్వ పాత్రను పోషించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు అభిప్రాయంతో సోనియాగాంధీ రాసిన వ్యాసం 'ఇండియాస్ మ్యూటెస్ వాయిస్, ఇట్స్ డిటాచ్‌మెంట్ విత్ పాలస్తీనా' శీర్షికన గురువారం రోజు ఓ ప్రముఖ వార్తా పత్రికలో ప్రచురితమైంది. ఇటీవలి కాలంలో పాలస్తీనా అంశంపై సోనియాగాంధీ రాసిన మూడో వ్యాసం ఇది కావడం గమనార్హం.

**నెతన్యాహు–మోదీ స్నేహం ప్రాతిపదికన నిర్ణయాలు**

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని మోదీకి ఉన్న వ్యక్తిగత స్నేహం ప్రాతిపదికనే కేంద్ర ప్రభుత్వం విదేశాంగ విధానాల రూపకల్పన జరుగుతున్నట్లుగా అనిపిస్తోందని సోనియాగాంధీ విమర్శించారు. భారతదేశ రాజ్యాంగ విలువలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోణంలో కేంద్ర సర్కారు విదేశాంగ విధానాలు ఉండాలే తప్ప, వ్యక్తిగత స్నేహాల ప్రాతిపదికన విధానాల రూపకల్పన చేయకూడదని ఆమె హితవు పలికారు. అతికొద్ది మంది వ్యక్తుల కోణంలో రూపొందించిన దౌత్యం చెల్లుబాటు కాదని, అది భారతదేశ విదేశాంగ విధానానికి దిక్సూచిగా నిలువలేదన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో, ప్రత్యేకించి అమెరికాలో ఇలాంటి పరిస్థితే ఉందని సోనియాగాంధీ అభిప్రాయపడ్డారు. కేంద్ర సర్కారు విధాన లోపం వల్ల భారత్ గత కొన్ని నెలల్లో చాలా బాధాకరమైన, అవమానకరమైన సందర్భాలను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు.

**1988లోనే పాలస్తీనాను దేశంగా గుర్తించాం!**

"చారిత్రకంగా పాలస్తీనా పక్షాన భారత్ నిలుస్తోంది. దాన్ని కాదని వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం విదేశాంగ విధాన రచన జరుగుతుండటం సరికాదు. పాలస్తీనాకు మద్దతుగా నిలిచే చారిత్రక పరంపరను భారత్ కొనసాగించాలి. ఈ దిశగా చొరవను, ధైర్యాన్ని చూపాలి. పాలస్తీనాను దేశంగా గుర్తిస్తూ ఇటీవలే ఫ్రాన్స్, యూకే, కెనడా, పోర్చుగల్, ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకున్నాయి. దీర్ఘకాలంగా బాధలు

మిగతా 2లో

## ప్రజల ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి

### సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** మద్యం కుంభకోణం కారణంగా అంతిమంగా బాధితులుగా మారింది సాధారణ ప్రజలేనని సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా బుధవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. బెయిలు మంజూరు చేసే విషయంలో నిందితుల వ్యక్తిగత స్వేచ్ఛ కంటే బాధితులుగా మారిన సాధారణ ప్రజల ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మద్యం కుంభకోణం కేసులో అభియోగపత్రాలను ఏసీబీ కోర్టు ముందు ఉంచామని, వాటిపై ఆ కోర్టు లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామన్నారు. అభియోగపత్రాలను విచారణ నిమిత్తం పరిగణనలోకి తీసుకొనే వ్యవహారం ఏసీబీ కోర్టు ముందు ఉన్నప్పుడు అసంపూర్తి అభియోగపత్రాలు దాఖలు చేశారనే కారణంతో ఏసీబీ కోర్టు నిందితులకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయడం తగదన్నారు. రీతూ ఛాబ్రియా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా ' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆధారపడి ఏసీబీ కోర్టు

మిగతా 2లో



## యూరప్‌కు జగన్

### కోర్టు అనుమతి.. ఏం జరిగిందంటే?

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి యూరప్ పర్యటనకు సీబీఐ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న జగన్ విదేశీ పర్యటనకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. జగన్ అక్టోబర్ 1 నుంచి 30 మధ్యలో పదిహేను రోజుల పాటు యూరప్ పర్యటనకు వెళ్లేందుకు అనుమతి కోరారు. అయితే, ఈ అభ్యర్థనను సీబీఐ తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. ఇప్పటివరకు ఆయన కోర్టుకు ఒకటి, రెండు సార్లు మినహా హాజరుకాలేదని

మిగతా 2లో




## అప్పుల తిప్పల్లో కుటుంబాలు

### దేశవ్యాప్తంగా పెరుగుతున్న కుటుంబాల సగటు రుణాలు

### గతంతో పోల్చితే పొదుపు కరిగి , పెరుగుతున్న అప్పులు

**ప్రజలకు చేరువ ప్రతినిధి :** అప్పుల బాధతో పిల్లలకు విషమిచ్చి, తాము తనువు చాలించిన తల్లిదండ్రులు. రుణభారంతో కుటుంబం ఆత్మహత్య, ఆర్థిక సమస్యలతో ఉరేసుకున్నకుటుంబం. ఇలాంటి వార్తలు నిత్యకృత్యం. మరి అప్పు చేయటం తప్పా? ఎటువంటి వాటికి రుణాలు చేయాలి? బాకీలు ఎప్పుడు భారంగా మారతాయి? అప్పులు తెచ్చి వ్యాపారం చేసేవాళ్లు తరచు చేసే తప్పులేంటి? నష్టాల కష్టాల నుంచి బయటపడే మార్గం ఏది? ఇంటి బడ్జెట్ రూపకల్పన ఎలా? పొదుపు చేసే మార్గాలేంటి? ఎలాంటి ఖర్చులను కట్టడి చేయాలి? ఎక్కడ పెట్టుబడి పెట్టాలి? ఆదాయం మూరెడు

మిగతా 2లో

ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం

# సంపాదకీయం

## రాజును మించిన రాజభక్తి

మోర్ లాయల్ దేన్ ది కింగ్ (రాజును మించిన రాజభక్తి) అనే మాట గుర్తుకు వస్తుంది. ఎపిలో టిడిపి, జనసేన కీలక నేతల మోడీ/ బిజెపి భజన చూస్తుంటే. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన స్పెషల్ అదనపు ఎఫెక్టు. ఈ మధ్య భాషాచాందసం కూడా తోడు చేశారు. తెలుగు టీచర్ల నియామకం లేదు గానీ తెలుగు సూక్తులు మాత్రం చాలా వినిపించారు. ఇక మొన్నటి రాజభాష (అంటే హిందీ అని చదువుకోవాలి) దినోత్సవాన పవన్ కల్యాణ్ మాట్లాడుతూ హిందీ భాష పెద్దమ్మ లాంటిదని వరస కలిపేశారు. అమ్మ భాష సరేగాని ఈ పెద్దమ్మ, చిన్నమ్మ, మేనత్త భాషలెలా నిర్ణయిస్తారు? వాస్తవానికి హిందీ, హిందూ, హిందూత్వ అనేది బిజెపి సంఘ పరివార్ సూత్ర త్రయం. ఏదో విధంగా హిందీని రుద్దాలని ప్రయత్నించి మొన్నటి ఫలితాల దెబ్బతో వెనక్కు తగ్గారు. ఆఖరుకు వారి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ కూడా మహారాష్ట్రలో మరాఠీలకు భయపడి త్రిభాషా సూత్రాన్ని పక్కన పెట్టేశారు. పవన్ మాత్రం హిందీ నేర్చుకోవలసిందే నంటున్నారు. హిందీ సినిమాలు తీయడం లేదా మనం డబ్బింగ్ చేయడంలేదా అని సినీ ప్రశ్నలు కూడా వేస్తున్నారు. విద్యామంత్రి లోకేష్ మరో అడుగు ముందుకేసి హిందీ మన జాతీయ భాష అని చెబితే ఇంటర్వ్యూ చేసే జర్నలిస్టు కూడా ఖండించాల్సి వచ్చింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు పి.వి.నరసింహారావు స్మారకోపన్యాసం ఇస్తూ ఆయన 17 భాషలు నేర్చుకుంటే కొంతమంది మాత్రం హిందీ వద్దంటున్నారని దెప్పి పొడిచారు. ఆసక్తి వున్నవవారు ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. కాకపోతే హిందీయేతర రాష్ట్రాలు బలవంతంగా రుద్దవద్దనేది ప్రజాస్వామ్య సమస్య తప్ప సెంటిమెంటు కాదు. నిన్నటి తరాల ప్రేక్షకుల మన్నన పొందిన బెంగుళూరు సరోజాదేవి 87వ ఏట కన్నుమూశారు. ఒక్క వివాదం, సమస్య కూడా లేకుండా తుది శ్వాస విడిచిన ఆమె విషయంలో నిజానికి విచారించవలసిందేమీ లేదు. పైగా విలక్షణమైన సంగతులే వున్నాయి. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో అగ్ర కథానాయకులందరితో సాంఘిక, పౌరాణిక పాత్రల్లో నటించడమే గాక హిందీలోనూ పాత్రలు పోషించారు. అక్కినేని నాగేశ్వరరావు ఎప్పుడూ సావిత్రి డేట్లు ముందే తీసేసుకుంటుండటంతో ఎన్టీఆర్ ఎక్కువగా సరోజా దేవితో నటించారు. దాగుడు మూతలు, మంచీ చెడు వంటి చిత్రాల్లో ఎన్టీఆర్‌కే ధైర్యం చెప్పి నడిపే పాత్రలు వేశారు. శ్రీకృష్ణార్జున యుద్ధంలో ఆ ఇద్దరు ఉద్దండుల మధ్యన ఆమె నటించారు. వ్యక్తిగతంగా ఆమె ఔన్నత్యం కూడా చెప్పుకోదగింది. తన పాత్ర గౌరవం, పద్ధతుల విషయంలో రాజీ పడేవారు కాదట. ఐ.టి దాడులు తదితర సమస్యలలో భర్త శ్రీహర్ష ఆమెకు బాగా తోడుగా వుండటంతో సావిత్రి వంటి విషాద పరిస్థితి రాకుండా బయటపడ్డారంటారు. అలాంటి వ్యక్తి 1987లో మరణించినా తట్టుకున్నారు. మళ్లీ పెళ్లి చేసుకోకపోవడంపై మాట్లాడుతూ ఆ దశలో మరో పురుషుడు తోడు లేకపోతే జీవించలేనని తాను అనుకోలేదని చెప్పారు. అవకాశాలు వచ్చినా మళ్లీ నటించలేదు కూడా. చిటపట చినుకులు, ఎక్కడికి పోతావు చిన్నవాడా వంటి పాటలతో ఆమెను ప్రేక్షకులకు బాగా దగ్గర చేసిన ఆత్మబలం సినిమా గురించి మాట్లాడుతూ దాంట్లో తనకన్నా జగ్గయ్య పాత్ర క్లిష్టమైందని చెప్పడం నటిగా ఆమె విశాలతను చెబుతుంది. ఆఖరి వరకూ సరోజా దేవి కళ్లను గురించి ప్రత్యేకంగా చెబుతుండేవారు కదా. అలాంటి కళ్లను తన మరణానంతరం తీసేసుకోవాలని ఆమె అయిదేళ్ల కిందటే రాసిపెట్టారట.

(మొదటి పేజీ తరువాయి)

## మోదీ పిలుపు

ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబుతో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కొత్తగా నియామక పత్రాలు పొందిన టీచర్లతో ముఖాముఖి నిర్వహించారు. "రాష్ట్రంలో ఇప్పటివరకు ఎంతమంది ముఖ్యమంత్రులు ఉన్నా, ఇంతమంది టీచర్లను నియమించింది నేనే. విద్యా రంగాన్ని ఎప్పటికీ నిర్లక్ష్యం చేయలేదు" అని సీఎం స్పష్టం చేశారు. మొదటి సూపర్ సిక్స్‌లో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పాన్ని గుర్తుచేశారు."మగవాళ్లకంటే మహిళలు చదువు చెప్పడంలో ఇంకా సమర్థవంతంగా ఉంటారు. కాబట్టి విద్యా వ్యవస్థలో మహిళలకు మరింత అవకాశాలు కల్పిస్తాం" అని సీఎం అన్నారు. లోకేశ్ మాట్లాడుతూ "మెగా డీఎస్సీ విజయవంతం కావడానికి అధికారులు, ఉపాధ్యాయులు, మా టీమ్ అందరూ కష్టపడ్డారు. అందుకే ఇది మెగా హిట్ అయ్యింది. గత అయిదేళ్లలో ఒక్క టీచర్‌ని కూడా నియమించకుండా నిరుద్యోగుల మనోభావాలను వైఎస్సార్సీపీ దెబ్బతీసింది, కూటమి ఇచ్చిన హామీని నెరవేర్చింది" అని తెలిపారు.

## ఉత్తరాది రాష్ట్రాలకు సింధూ జలాలు

చేపట్టేందుకు సిద్ధమైంది. గత శుక్రవారం సీనియర్ మంత్రులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సింధూ నదిని బియాస్ నదితో కలిపే 14 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణానికి సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు రిపోర్ట్ ఇప్పటికే తయారవుతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించే బాధ్యతను బహుళజాతి నిర్మాణ సంస్థ %వా% అండ్ %ు%కి అప్పగించినట్టు తెలుస్తోంది. ఈ రిపోర్టు వచ్చే ఏడాది నాటికి సిద్ధమవుతుందని అంచనా. సింధూ జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించేందుకు ప్రతిపాదిత 113 కిలోమీటర్ల కాలువ నిర్మాణ పనులను కూడా మంత్రుల సమావేశంలో సమీక్షించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి ఈ ప్రాజెక్టును సిద్ధం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. సింధూ నదీ జలాల్లో భారత్ తన వాటా సద్వినియోగం చేసుకునేందుకు ఇంటర్-బేసిన్ ఇండస్ వాటర్ ట్రాన్స్‌ఫర్ స్కీమ్ కింద ఒక భారీ ప్రాజెక్టును రూపొందించారని అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టును ప్రభుత్వ అధికారులు ఉన్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నాయి. 14 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం ఈ ప్రాజెక్టులో అత్యంత సవాలుతో కూడిన అంశంగా తెలుస్తోంది. ఈ టన్నెల్ నిర్మాణానికి పర్వత శిలలపై వివరణాత్మక అధ్యయనం అవసరమని సమాచారం. బలహీనమైన శిలలు ఉన్నట్లయితే, పైపుల ద్వారా టన్నెల్‌ను నిర్మిస్తారు. టన్నెల్ బోరింగ్ మెషిన్లు, రాక్ షీల్డ్ టెక్నాలజీని ఉపయోగించి వేగవంతంగా, సురక్షితంగా నిర్మాణం పూర్తి చేయాలని ప్రతిపాదించారు. ఈ టన్నెల్ జమ్మూకశ్మీర్‌లోని కరువా జిల్లాలోని ఉజ్ మల్టీపర్పస్ ప్రాజెక్టుతో కలుపుతూ రావి నది ఉపనది అయిన ఉజ్ నీటిని బియాస్ బేసిన్‌కు బదిలీ చేస్తుంది. ఈ టన్నెల్ రావి-బియాస్-సట్లెజ్ వ్యవస్థను ఇండస్ బేసిన్‌తో కలుపుతుంది. దీనివల్ల భారత్ తన నీటి వాటాను గరిష్టంగా వినియోగించుకోగలుగుతుంది. ఈ నిర్మాణం 2028 నాటికి పూర్తవుతుందని అంచనాలున్నాయి. దీని వ్యయం దాదాపు 4 నుంచి 5 వేల కోట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతాల్లో ఇందిరా గాంధీ కాలువకు నీటిని మళ్లించడం ద్వారా సాగునీటి సామర్థ్యాన్ని పెంచుతుంది. జమ్మూకశ్మీర్, హరియాణా, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందుతాయి. చీనాబ్ నదిని రావి-బియాస్-సట్లెజ్ వ్యవస్థతో కలిపే కాలువ నిర్మాణం జరుగుతుంది. ఇది రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌కు నీటిని చేరవేస్తుంది. ఈ ప్రాజెక్టు ఢిల్లీ, పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లో తాగునీటి లభ్యతను కూడా మెరుగుపరుస్తుంది. భారత్ తన వాటా నీరు పాకిస్థాన్‌కు ప్రవహించకుండా నిలిపివేసి, దేశ నీటి భద్రతను బలోపేతం చేస్తుంది. ఇది వాతావరణ మార్పులు, మారుతున్న వర్షపాత నమూనాల ప్రభావాన్ని తగ్గించడంతోపాటు, ఇప్పటికే ఉన్న 13 కాలువ వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. అదనంగా, జమ్మూలోని రణబీర్ కాలువ పొడవును 60 కిలోమీటర్ల నుంచి 120 కిలోమీటర్లకు విస్తరించే ప్రణాళికలు కూడా ఉన్నాయి. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరింది. దాంతో సింధూ నదితో పాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత దీని అమలును భారత్ నిలిపివేసింది. అప్పటి నుంచి ఈ అంశం దాయాదికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పాకిస్థాన్‌లో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపై ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80శాతం ఈ ఒప్పందం కింద లభిస్తుంది.

## వెనుకబడిన వర్గాల కోసం 'మోస్ట్ బ్యాక్‌వర్డ్ జస్టిస్ మేనిఫెస్టో

పూర్తి హక్కులు కల్పించడంలో కట్టుబడి ఉంది. బిహార్‌లో వెనుకబడిన వర్గాలను బలోపేతం చేసి, వారి భాగస్వామ్యాన్ని పెంచడానికి మేం ఈ మేనిఫెస్టో తీసుకొస్తున్నాం. ఈ వర్గాల ప్రగతికి విద్యే అత్యుత్తమ మార్గం. అందుకే విద్యా రంగంలో వారికి మరింత అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నాం' అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు.

**ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు : రాహుల్ గాంధీ**

ఇకపై ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేస్తామని రాహుల్ గాంధీ తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో రిజర్వ్ చేసిన సీట్లలో సగం ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/ఈబీసీ పిల్లలకు కేటాయిస్తాం. నియామకాలలో జరిగే అన్యాయ పద్ధతులను రద్దు చేస్తాం ఇది కేవలం విద్య గురించే కాదు. వెనుకబడిన వర్గాల సమానత్వం, గౌరవం కోసం పోరాటం. ఇదే నిజమైన సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి హామీ' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, అతి వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం 10 తీర్మానాలు చదివి వినిపించారు. తమ కూటమి అధికారంలోకి వస్తే తప్పకుండా ఈ హామీలను నేరవేరుస్తామని చెప్పారు. నీతీశ్ కుమార్ ప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రితం నిర్వహించిన కులగణన ప్రకారం, బిహార్? జనాభాలో 36శాతం మంది ఈబీసీలు ఉన్నారని అన్నారు. స్థానిక సంస్థలు, పంచాయతీల్లో ఈబీసీల రిజర్వేషన్లు 20శాతం నుంచి 30 శాతానికి పెంపు. SC, ST, OBC, EBCలకు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో (25 కోట్ల వరకు) 50 శాతం వాటా. ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రవేశాలకు హక్కు. భూమిలేని కుటుంబాలకు పట్టణాల్లో 3 డెసిమల్, గ్రామీణ ప్రాంతాల్లో 5 డెసిమల్ భూమి కేటాయింపు' అని రాహుల్ గాంధీ తెలిపారు. బిహార్‌లో తమ కూటమి అధికారంలోకి వస్తే వారి సమాజంపై జరిగే దాడులకు వ్యతిరేకంగా కొత్త చట్టం తెస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో అధిక రిజర్వేషన్లు, విద్య, గృహనిర్మాణం, ప్రభుత్వ కాంట్రాక్టులలో ప్రత్యేక ప్రయోజనాలు వంటి చర్యలను హామీ ఇచ్చిందని అన్నారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఇటీవల ఓట్ల చోరీ అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత ఎన్నికల సంఘంపై దాడిని మరింత పెంచారు. ఈసీని ఎన్నికల కాపలాదారునిగా అభివర్ణించారు. తెల్లవారుజామున నిద్రలేచి ఓట్లచోరీకి పాల్పడుతున్నారని, దొంగలను రక్షిస్తుందని ఆరోపించారు. ఓట్లను చోరీకి పాల్పడుతున్న వారు తెల్లవారుజామున 4గంటలకు నిద్రలేచి, 36సెకండ్లలో ఇద్దరు ఓటర్లను తొలగించిన తర్వాత మళ్లీ నిద్రకు ఉపక్రమిస్తున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. వారిని ఓ క్రమపద్ధతిలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికలసంఘం ఓట్లచోరీకి పాల్పడినవారిని కాపాడటం ఆపాలని, ఓట్లచోరీపై దర్యాప్తు చేస్తున్న కర్ణాటక సీఐడీ కోరిన సమాచారాన్ని వారంలోపు అందించాలని శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

## ప్రతి ఏడాది డీఎస్సీ

ఒక్క ఫిర్యాదు కూడా లేకుండా బదిలీలు పూర్తి చేశామని గుర్తు చేశారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలున్నా ప్రతి ఒక్కరికి రూ.15 వేలు చొప్పున ఇచ్చామని వెల్లడించారు.

**ఆ బాధ్యత టీచర్లు తీసుకోవాలి :** నారా లోకేశ్ నో బ్యాగ్ డే విధానం తెచ్చారని ఇది వినూత్నంగా ఉందన్నారు. ఈసారి స్కూళ్లు తెరిచేలోగా స్కూల్ కిట్లు, పుస్తకాలు ఇచ్చామని తెలిపారు. అభివృద్ధితో ఉద్యోగాలు వస్తాయి, ఆదాయం పెరుగుతుంది, సంక్షేమం సజావుగా సాగించవచ్చని చంద్రబాబు స్పష్టం చేశారు. విలువలతో కూడిన విద్యను అందించేలా టీచర్లంతా పని చేయాలని సూచించారు. పిల్లల్లో నైతిక విలువలను పెంచేలా టీచర్లు పాఠాలు చెప్పాలన్నారు. పిల్లల్లో నైపుణ్యాలు పెంచే బాధ్యత టీచర్లు తీసుకోవాలని కోరారు.

**పరిస్థితులకు అనుగుణంగా టీచర్లు అప్డేట్ :** భవిష్యత్తులో విద్యా రంగంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయోననేది టీచర్లు ఊహించగలగాలని తెలిపారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా టీచర్లు అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. తాను నిత్య విద్యార్థినన్న చంద్రబాబు ఎప్పుడు కొత్త విషయాలు నేర్చుకుని ప్రజలకు ఉపయోగపడతాయనుకుంటే వాటిని అమలు చేస్తానన్నారు. 2019-24 మధ్య కాలం విద్యా వ్యవస్థకు ఓ శాపం అన్నారు. 10 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారని తెలిపారు. ఏపీ విద్యా రంగాన్ని 19వ స్థానానికి దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

**లోకేశ్ ఛాలెంజ్‌గా తీసుకున్నారు :** ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేశారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చాయని వెల్లడించారు. నో అడ్మిషన్లు బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తెచ్చారన్నారు. ఇది మరింతగా పెరగాలని అభిప్రాయపడ్డారు. విద్యా శాఖ కఠినంగా ఉంటుందని చెప్పానని అయినా లోకేశ్ ఛాలెంజ్?గా తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రాథమిక విద్య బాగుంటే ఉన్నత చదువులు అద్భుతంగా ఉంటాయన్నారు. దీంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందని తెలిపారు.

## మౌనం సరికాదు

పడుతున్న పాలస్తీనా ప్రజల ధర్మబద్ధమైన ఆశయం సాకారమయ్యే దిశగా ఈ పరిణామం కీలక ముందడుగు లాంటిది. ఇప్పటివరకు ఐక్యరాజ్యసమితిలోని 193 దేశాల్లో 150కిపైగా పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. వాస్తవానికి ఈ విషయంలో అన్ని దేశాల కంటే భారత్ చాలా ముందుంది. 1988 నవంబరు 18నే పాలస్తీనాను దేశంగా భారత్ గుర్తించింది. దశాబ్దాల తరబడి పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్(పీఎల్ఓ)కు మనదేశం అండగా నిలిచింది. గతంలో దక్షిణాఫ్రికాలో జరిగిన వర్ణ వివక్షపై గళమెత్తిన తొలిదేశాల్లో భారత్ ఒకటి. 1954-1962 మధ్యకాలంలో అల్జీరియా స్వాతంత్ర్య పోరాటానికి మద్దతిస్తూ మనదేశం వాణిని వినిపించింది. 1971లో తూర్పు పాకిస్థాన్‌లో నరమేధాన్ని ఆపేందుకు భారత ఆర్మీ నేరుగా సైనిక చర్యను నిర్వహించింది. దాని ఫలితంగానే బంగ్లాదేశ్ ఏర్పాటైంది" అని సోనియాగాంధీ వివరించారు.

**మోదీ సర్కారు బాధ్యతను, పాత్రను మర్చిపోయింది**

"మొదటి నుంచే శాంతి, మానవ హక్కుల పక్షాన భారత్ బలంగా నిలుస్తోంది. పాలస్తీనా పౌరుల మానవ హక్కులు, ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం భారత్ వాణిని వినిపించాలి. న్యాయం కోసం పాలస్తీనా చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలి. 2023 అక్టోబరు నుంచి పాలస్తీనాలో నరమేధం జరుగుతున్నా భారత ప్రభుత్వం తన బాధ్యతను, పాత్రను మర్చిపోయినట్లుగా ప్రవర్తిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజా మరుభూమిగా మారింది. అక్కడి స్కూళ్లు, ఆస్పత్రులు, ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఆకలి తీర్చుకోవడానికి పాలస్తీనా ప్రజలకు అన్నం కూడా దొరకని పరిస్థితిని ఇజ్రాయెల్ క్రియేట్ చేసింది. ఔషధాలు, ఆహారం, సహాయక సామగ్రిని కూడా పాలస్తీనాలోకి ఇజ్రాయెల్ అనుమతించడం లేదు. ఆహారం కోసం క్యూ లైన్లలో నిలబడిన వందలాది మంది పాలస్తీనా పౌరులను దారుణంగా ఇజ్రాయెలీ సైనికులు కాల్చి చంపారు. అది చాలా అమానవీయ ఘటన. పాలస్తీనా అంశం, ఇజ్రాయెల్ క్రూరత్వంపై ప్రపంచం చాలా ఆలస్యంగా స్పందిస్తోంది" అని సోనియాగాంధీ పేర్కొన్నారు.

**ఈ టైంలో ఇజ్రాయెల్‌తో ఒప్పందమా?**

"పాలస్తీనాను సార్వభౌమ దేశంగా ప్రపంచ దేశాలు గుర్తిస్తున్న ప్రస్తుత తరుణం చారిత్రకమైంది. ఇది మానవ హక్కులకు దక్కిన గౌరవం. ఇజ్రాయెల్ చేతిలో దారుణంగా అణచివేతకు గురవుతున్న పాలస్తీనాను గుర్తించడం ప్రపంచ దేశాల నైతిక బాధ్యత. అన్యాయానికి వ్యతిరేకంగా గళం వినిపించడం భారత్ సహా అన్ని దేశాల బాధ్యత. భారత సర్కారు సహా అన్ని దేశాల ప్రభుత్వాలు పాలస్తీనా అంశంపై మౌనం వహించడం అంటే తటస్థంగా వ్యవహరించినట్టు కాదు. ఇతరులతో నేరంలో పాలు పంచుకుంటున్నారనే అర్థమిచ్చేలా ఈ మౌనం కనిపిస్తోంది. భారత్ ఇదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. రెండువారాల క్రితమే ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై న్యూదిల్లీ వేదికగా భారత్, ఇజ్రాయెల్ సంతకాలు చేశాయి. అత్యంత వివాదాస్పదుడు, పాలస్తీనా పౌరుల హక్కులను వ్యతిరేకించే ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి భారత్‌లో పర్యటించారు. పాలస్తీనా వ్యవహారాన్ని విదేశాంగ అంశంలా కాకుండా, దేశ నైతికత, నాగరిక వారసత్వంతో ముడిపడిన అంశంలా భారత్ చూడాలి. బ్రిటీష్ పాలనలో భారతీయులు ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నారో, అలాంటి స్థితినే ఇప్పుడు ఇజ్రాయెల్ వల్ల పాలస్తీనీయులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా పాలస్తీనియుల భూములు ఇజ్రాయెల్ కబ్జాలో ఉన్నాయి. పాలస్తీనాకు దన్నుగా నిలవాల్సిన బాధ్యత భారత్‌పై ఉంది" అని సోనియాగాంధీ అభిప్రాయపడ్డారు.

## ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి

నిందితులకు డిఫాల్ట్ బెయిలు మంజూరు చేసిందని, అయితే ఆ తీర్పు అమలును నిలుపుదల చేస్తూ రీకాల్ పిటిషన్లో సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చిందన్నారు. ఆర్థిక నేరాలను ఛేదించడం సంక్లిష్టంగా మారిందని, దీంతో దర్యాప్తులో కొంత జాప్యం జరుగుతోందన్నారు. మద్యం కుంభకోణం కేసులో నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు ఈనెల 6న డిఫాల్ట్ బెయిలిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. బుధవారం జరిగిన విచారణలో ఇరువైపులా న్యాయవాదుల వాదనలు ముగిశాయి. సందేహాలపై స్పష్టత కోసం తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

**అనిల్‌రెడ్డి కంపెనీల్లో డైరెక్టర్ ఆయన తల్లి వైఎస్ భారతి :** మద్యం కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెదనాన్న కుమారుడైన వైఎస్ అనిల్‌రెడ్డికి సంబంధించిన కంపెనీల కార్యాలయాలు, నివాసాల్లో సిట్ అధికారులు సోదాలు చేపట్టిన సంగతి తెలిసిందే. హైదరాబాద్, చెన్నైల్లోని మొత్తం 10 ప్రదేశాల్లో జరిపిన ఈ సోదాల్లో అక్కడి కంప్యూటర్లలోని హార్డ్‌డిస్క్‌లు, ల్యాప్‌టాప్‌లను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాల లావాదేవీలు, ఐటీ రిటర్న్‌ల వంటివి సీజ్ చేశారు. వాటిని పూర్తిగా విశ్లేషించిన తర్వాత సంబంధిత వ్యక్తులకు నోటీసులిచ్చి, విచారణకు పిలిపించాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఈ కంపెనీల్లో డైరెక్టర్‌గా కొనసాగిన భారతిరెడ్డి మాజీ సీఎం జగన్ భార్య కాదు ఆమె అనిల్‌రెడ్డి తల్లి, జగన్ పెదనాన్న జార్జిరెడ్డి భార్య భారతిరెడ్డి అని తేల్చిన విశయం విదితమే. మరోవైపు మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన ముడుపుల సొత్తులో భారీ మొత్తాన్ని విదేశాలకు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో తేలింది. ఈ లావాదేవీలకు సంబంధించిన కీలక లెడ్జర్లను ఈడీ తాజాగా స్వాధీనం చేసుకుంది. దుబాయ్ పారిపోయిన మద్యం కుంభకోణం నిందితుడు తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9) సహా అక్కడే ఉన్న మరికొందరు నిందితులకు ఈ ముడుపుల సొమ్ము చేరినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

## యూరప్‌కు జగన్

గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు తిరిగి ఎప్పుడు వచ్చారనే దానిపై స్పష్టత లేదని సీబీఐ వాదించింది.

**కోర్టు షరతులు:** నవంబర్ 1 నుంచి హాజరు తప్పనిసరి ఇరుపక్షాల వాదనలు విన్న సీబీఐ ప్రత్యేక కోర్టు, జగన్‌కు విదేశీ పర్యటనకు అనుమతిని ఇచ్చింది. కానీ, కొన్ని కీలకమైన షరతులను విధించింది. ముఖ్యంగా ఆయన పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత నవంబర్ 1 నుంచి 14 లోపు తప్పనిసరిగా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. అంతేకాకుండా, పర్యటన నుంచి వచ్చాక తన పాస్‌పోర్ట్‌ను మళ్లీ కోర్టులో సబ్మిట్ చేయాల్సి ఉంటుందని కూడా స్పష్టం చేసింది.

**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక:** కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ దాదాపు ఖరారు కేసుల విచారణకు వేగం గతంలో, 2019 ఎన్నికలకు ముందు జగన్ ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరయ్యేవారు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆ తర్వాత అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఆయన కోర్టు విచారణలకు దూరంగానే ఉన్నారు. తాజా ఆదేశాల నేపథ్యంలో జగన్ తిరిగి వచ్చాక నవంబర్‌లో తప్పనిసరిగా కోర్టు ముందుకు హాజరుకావాల్సి రావడం ఖాయం. దీంతో ఇకపై ఆయనపై ఉన్న కేసుల విచారణ వేగం పుంజుకునే అవకాశం ఉందనే అంచనాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి రావడంతో, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ మళ్లీ పట్టాలెక్కుతుందని భావిస్తున్నారు. మొత్తం మీద, యూరప్ పర్యటనకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జగన్‌కు ఊరటనిచ్చినప్పటికీ, నవంబరులో వ్యక్తిగత హాజరుతో ఆయనపై ఉన్న కేసుల విచారణ మళ్లీ వేగం పుంజుకునే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి.

## రుణం పెరుగుతోంది...

ఖర్చులు బారెడు. చివరికి అప్పులు బండెడు! ఇదే నేటి ఎన్నో మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి. ఈ దుస్థితి మారేదెలా?? గడిచిన కొంతకాలంగా దేశవ్యాప్తంగా కుటుంబాల సగటు రుణాలు చెబుతున్న చేదు నిజాలు. పొదుపు తగ్గుతూ, బాకీలు పెరుగుతూ వాళ్లు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఏమిటి? ఆర్థిక సమస్యలు, రుణాలతో కొన్ని కుటుంబాలకు కుటుంబాలే ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తున్నాం. ఏ పరిస్థితుల్లో అప్పులు ఆత్మహత్యల వరకు నెట్టేస్తున్నాయి? అసలు బాకీలు చేయడం తప్పా? ఒప్పా? అప్పుల్లోనూ మంచి అప్పులు, చెడు అప్పులు అన్న తేడా ఏమైనా ఉంటుందా? ఒక సాధారణ, మధ్యతరగతి కుటుంబానికి అవసరమైన రుణం, భారంగా రుణాల మధ్య తేడా ఎలా గుర్తించాలి? ఇప్పుడు చూస్తున్న పరిస్థితుల్లో ఎక్కువగా ఎలాంటి రుణాలు ప్రమాదకరమవుతున్నాయి? అప్పులు ఆర్థిక పరిస్థితిని చేజార్చేస్తున్నాయి అనడానికి సంకేతాలేమైనా ఉంటాయా? ఇప్పుడంతా క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్ల, బిజినెస్ లోన్ల హవా నడుస్తోంది. అవన్నీ నిజంగా ఫైనాన్షియల్ ఫ్రీడమ్ ఇస్తున్నాయా? భవిష్యత్‌నే దెబ్బ తీస్తున్నాయా? ఇప్పుడు ఉద్యోగాల కోతలు కూడా చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో కావాలని కాకపోయినా విధివశాత్తు ఆర్థిక ఇబ్బందుల్లో పడాల్సి వస్తుంది. అలాంటప్పుడు రుణాలు తీర్చే మార్గమేంటి? ఒక అప్పు చేయడానికి మరో అప్పు చేయడం కొన్నిసార్లు బాకీలు చేసి మరీ పెట్టుబడులు పెట్టడం. ఇవి రిస్క్ మిటిగేషనా? లేక ఆర్థిక నిర్వహణ తప్పిదాలా? నిజంగా రాత్రికి రాత్రే జీవితం తిరగబడింది. తెల్లారితే ఒకవైపు బ్యాంకు ఈఎంఐలు, మరోవైపు బయట తెచ్చిన అప్పులు, వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి. అలాంటి వాళ్లేం చేయాలి? ఇవేమీ వద్దు అప్పులేనివాడే అసలైన ధనవంతుడు అనుకుని ప్రశాంతంగా ఉండాలంటే ఒక మధ్యతరగతి కుటుంబానికి సంబంధించి సరైన ఇంటి బడ్జెట్ ఎలా తయారు చేసుకోవాలి? ఆదాయానికి వ్యయానికి పొంతన కుదరనప్పుడే రుణాల అవసరం పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఖర్చులు అదుపులో పెట్టడానికి ఎలాంటి ప్రాక్టికల్ పద్ధతులు పాటించాలి? ఎటుచూసినా బాకీలే పరిస్థితేం బాలేదు. ఇది చాలామంది నిట్టూర్పు. అయితే అదే ఆఖరా? వాళ్లు మళ్లీ నిలబడి ముందుకెళ్లే ఛాన్స్ ఎలా లభిస్తుంది? కష్టంలోనూ పొదుపు, పెట్టుబడి సాధ్యమేనా? ఇదే అంశంపై నేటి ప్రతిధ్వని. ఈ చర్చలో సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ రేవంత్ చలమల, వెల్త్ అండ్ ఇన్సూరెన్స్ మేనేజర్ డా.బీ.అనిల్?కుమార్, ఆర్థిక నిర్వహణ నిపుణులు డా.హనుఎడ్లూరి పాల్గొన్నారు. మరిన్ని విషయాలు వారిని అడిగి తెలుసుకుందాం.

# సేవ్ కరేడు సేవ్ వినాయక నిమజ్జన కార్యక్రమం



ఉలవపాడు, ప్రజలకి చేరువ ప్రతినిధి : సేవ్ కరేడు సేవ్ వినాయక విగ్రహం నెలరోజులు ప్రతిరోజు పూజలు చేసి గురువారం నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగినది ప్రజలు భక్తిశ్రద్ధలతో హారతులు ఇచ్చి దేవుని దీవెనలు పొంది ఆనంద పొందారు గ్రామ ఊరేగింపులో అత్యధికంగా పిల్లలు మహిళలు మరి గ్రామ ప్రజలు హాజరై సముద్రంలో నిమజ్జనం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు ఉద్యమ నాయకుడు మిరియం శ్రీనివాసులు కలికి శివారెడ్డి పాపన బోయిన లక్ష్మీనారాయణ మాజీ సర్పంచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## వేపాకుల దుర్గమ్మ తల్లి

# విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు








చీడికాడ, ప్రజలకి చేరువ ప్రతినిధి : అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని జి కొత్తపల్లి పంచాయతీ శివారు చిన్న గోగాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ వేపకుల దుర్గమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 26 నుండి ప్రారంభం అవుతున్నట్లు ఆలయ ధర్మకర్త అద్దిపల్లి చిన్న అప్పారావు తెలిపారు. తమ గ్రామంలో 2023 అక్టోబర్ 13న రోడ్డు పక్కన గల వేప చెట్టుకు పాలు కారాయి అన్నారు. దీంతో చెట్టుకు పూజలు చేయడం ప్రారంభించామని, అనంతరం అమ్మవారు కలలోకి వచ్చి ఆలయాన్ని నిర్మించాలని సూచించగా నూతనంగా ఆలయం నిర్మించడం జరిగిందన్నారు. నాటినుండి వేపచెట్టు వద్ద పూజలు చేసేవారిని అయితే అమ్మవారి ఆదేశానుసారం ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అయితే ఆలయ నిర్మాణం నేటికీ పూర్తి కావడంతో 26న ఉదయం 8 గంటల నుండి వేద పండితులచే విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, అంకురార్పణం, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్ని ప్రతిష్ట, ఇతర హోమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సాయంత్రం పున: పూజలు, దేవత ఊరేగింపు, నీరాజన మంత్ర పుష్పాలతో ముగింపు జరుగుతుందన్నారు. 27న అమ్మవారికి అత్యంత వేడుకగా మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందని, అనంతరం కుంకుమార్చన నిర్వహించి పూజలు, అభిషేకాలు చేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదే రోజు రాత్రి 7 గంటలకు భవాని భక్తుల భజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండలంలోని భక్తులందరూ హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నడే సంపూర్ణ ఆరోగ్యం**

**పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి : ఎంపీడీవో సుజాత**



పొన్నలూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి : పరిసరాల పరిశుభ్రంగా ఉన్న నాడే ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండగలరని కొన్నలూరు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిని పి సుజాత అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. పొన్నలూరు గ్రామ పంచాయితీ పరిధిలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో భాగంగా గ్రామ పంచాయతీ భవనం పరిధిలో వీధులలో ఒక గంటపాటు అందరూ కలిసి శుభ్రపరచడం శ్రమదానం చేశారు. ప్రజల్లో సమూహ చైతన్యం పెంపొందించే విధంగా సూచనలు ఇచ్చారు. క్లాప్ మిత్రులకి వైద్య శిబిరం నిర్వహించి పలు రకాల పరీక్షలు చేయించారు. ఈకార్యక్రమములో ఎంపిడిఓ పీ సుజాత, గ్రామ పంచాయితీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఏం. నారాయణ ఎంపీటీసీ, గ్రామ నాయకులు, మండవ మురళి , సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ,అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పంచాయితీ కార్యదర్శి గ్రామ ప్రజలు పాల్గున్నారు.

## నిషితను ఆశీర్వదించిన

# జగన్మోహన్ రెడ్డి

**జగన్మోహన్ రెడ్డి సమక్షంలో దద్దాలనిషిత జన్మదిన వేడుకలు**

**చిన్నారి నిషితకు కేక్ తినిపించిన జగన్మోహన్ రెడ్డి**

**కుటుంబ సమేతంగా జగన్మోహన్ రెడ్డిని కలిసిన దద్దాల నారాయణ యాదవ్**







కనిగిరి, ప్రజలకు చేరువ : కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ కుమార్తె దద్దాల నిషిత జన్మదిన వేడుకలు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. నిషిత జన్మదిన వేడుకలు సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ కుటుంబ సమేతంగా కేంద్ర పార్టీ కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డిని కలవడం జరిగింది. ఆయన చిన్నారి నిషితను ఆప్యాయంగా ముద్దాడి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి చిన్నారికి తినిపించారు. ముందుగా దద్దాల నారాయణ యాదవ్ జగన్ మోహన్ రెడ్డికి రాధా కృష్ణ విగ్రహంతోపాటు పూలబొకే అందజేశారు .ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ వెంట వారి సతీమణి దద్దాల మంజు భార్గవి,మితికాల పద్మావతి,దద్దాల రాములు, వేల్పుల ప్రసాదు మరియు దద్దాల పుల్లారావు ఉన్నారు.

## ఉప్పలపాడులో

# స్వచ్ఛభారత్ స్వచ్ఛ దివస్



కొండిపి, ప్రజలకి చేరువ ప్రతినిధి

మండలంలోని ఉప్పలపాడు గ్రామపంచాయతీలో జరిగిన స్వచ్ఛభారత్ స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మండల ఎంపీడీవో రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిస్థితి ఉన్నత పాఠశాల వద్ద నుండి వీధుల్లో నిర్వహించిన పారిశుద్ధ కార్యక్రమంలో ఆయన పాల్గొని సహచరులను చైతన్యవంతం చేసి తను పరిసరాల పరిశుభ్రతకు చేయి కలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ అంగన వాడి ఆశ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## డియస్సి నియామక పత్రాల అందజేతలో

# పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర




కనిగిరి ప్రజలకుచేరువ : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించినది. ఈ డియస్సిలో వేలమంది ఉపా ధ్యాయ ఉద్యోగాలు పొందారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన 15,941 మంది కి గురువారం రాష్ట్రరాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈయన తోపాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్రపార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చుక్కలను తాకిన నాటు కోళ్ల ధరలు



చీడికాడ, ప్రజలకి చేరువ ప్రతినిధి : దసరా సమీపిస్తుండడంతో నాటు కోళ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని కోనాం లో జరుగు గురువారపు సంతలో కేజీ కోడి 1000 నుండి 1200 పలికింది. ఇప్పటివరకు కేజీ కోడి 500, 600 పలికేది. ఏజెన్సీకి ఆనుకొని ఉన్న ఈ వారపు సంతకు గిరిజన గ్రామాల నుండి అత్యధిక సంఖ్యలో నాటు కోళు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. దీంతో నాటు కోళ్లు కావలసిన ప్రజలు దళారులు సంతలో కొనుగోలు చేస్తారు. దళారులు ఇక్కడ కొనుగోలు చేసి చోడవరం అనకాపల్లి సబ్బవరం పెందుర్తి విశాఖ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. దసరా సమీపిస్తుండడంతో సంతలో నాటు కోళ్లకు డిమాండ్ ఏర్పడింది. వినియోగదారులు కొనుగోలుదారులు అధిక సంఖ్యలో సంఖ్యలో తరలి రావడంతో కోళ్ల ధరలకు ఒక్కసారి రెక్కలు వచ్చాయి. పోటా పోటీగా కొనుగోలు చేయడంతో వినియోగదారులు సైతం తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేశారు.

## బోర్డు అనుమతితోనే

# పొగాకు సాగు చేయాలి

**ఏఎస్ ఎం కిరణ్**




కందుకూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి : బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలని ఏ ఎస్ ఎం కిరణ్ సూచించారు. గురువారం 26 వ పొగాకు వేలం కేంద్రం వారు బోర్డు లో పొగాకు పంట నియంత్రణ పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో 26 వ పొగాకు బోర్డ్ వేలం నిర్వహణ అధికారి యం. కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయం గా వాతావరణ పరిస్థితులు ఉన్నాయనీ ఈ కారణంగా పొగాకు పండించే బ్రిజిల్ , చైనా, జింబంబే మొదలగు దేశాలలో పొగాకు ఉత్పత్తి అధికంగా ఉన్నదని చెప్పారు. ఈ సంవత్సరం పొగాకు ధరలలో హెచ్చు తగ్గులను ఆఉండవచ్చును అని రైతులకు తెలియచేశారు. అందువల్ల రెట్కతులు ఎవ్వరూ అధిక ధరలకు బ్యారన్ లను , పొలాలను కౌలుకి తీసుకొని పొగాకు పంటను సాగు చేసి నష్టపోవద్దని తెలియజేశారు. ఈ సంవత్సరం పొగాకు పంట ధరలు అంత ఆశాజనకంగా ఉండకపోవచ్చునని మంచి గ్రేడు పొగాకు పండనట్లు అయితే రైతులు మరింత ఇబ్బంది పడవలసి వస్తుందని తెలియచేశారు. పొగాకులో పొటాసియం వినియోగం పెంచడం వల్ల కొంత హై గ్రేడు పొగాకు దిగుబడి సాధించవచ్చు అని పొగాకు మండేలమీద ఎక్కవ కాలం చెడిపోకుండా ఉండే సామర్థ్యం పెరుగుతుందని తెలియజేశారు. రైతు సోదరులు పోగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు పండించాలనికోరారు. ఈ కార్యక్రమం లో పొగాకు బోర్డు క్షేత్ర స్థాయి అధికారి అశోక్ రాజ్ ఐటీసీ కంపెన్ ప్రతినిధి చంద్రశేఖర్ జిపిఐ కంపెనీ ప్రతినిధి షేక్. రబ్బానీ రైతులు పాల్గొన్నారు.

# బద్దిపూడిలో గంగమ్మ తల్లి జాతర

**పార్టీలకి అతీతంగా జరుపుకోవాలి.. గంగమ్మ గుడి కి మేమే కమిటీ వైసీపీ నేతలు**

**గ్రామ ప్రజలతో సంబంధం లేకుండా గంగమ్మ తల్లి జాతర.. జాతరను కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా జరుపుకుందాం**





ఉలవపాడు, ప్రజలకి చేరువ ప్రతినిధి : ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ ప్రజలు అందరూ కలిసి కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని గంగమ్మ జాతరను కందుకూరు వైయస్సార్సీపి నాయకుల అండదండలతో బద్దిపూడి గ్రామంలోని వైఎస్ఆర్సిపి నాయకులు 14 మంది దేవరపల్లి రామచంద్రారెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, చేజర్ల సుబ్బరామిరెడ్డి, చేజర్ల వెంకట రామిరెడ్డి, ముచ్చుల మహేందర్ రెడ్డి, ముచ్చుల పరమేశ్వర్ రెడ్డి, చేజర్ల సాయి రెడ్డి, చీరే మహేందర్ రెడ్డి, కూనం ధర్మారెడ్డి, రామాల రవీందర్ రెడ్డి, చీరే కామిరెడ్డి, తాటిపర్తి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి వెంకారెడ్డి, చీరే మధుసూదన్ రెడ్డి ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు వైయస్సార్ సిపి నాయకులు గ్రామ ప్రజలతో సంప్రదింపులు లేకుండా ఎవరి అనుమతి లేకుండా వారికి వారే ఏకగ్రీవంగా గంగమ్మ గుడి కమిటీగా నిర్ణయించుకుని గంగమ్మ తల్లి జాతరను జరుపుటకు నిర్ణయించుకున్నారు. వారు బద్దిపూడి గ్రామంలో వారికి వారే గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతరను జరుపుటకు గ్రామంలోని గ్రామ పెద్దలను సంప్రదింపులు చేయకుండా వారి ఇష్ట రాజ్యంగా బద్దిపూడి గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటిలోని ఓ తలకాయకు 600 వందలు రూపాయల చొప్పున వసూలు చేయు భాగంలో గ్రామ ప్రజలు కులమతాలకు అతీతంగా జరుగుతున్న గంగమ్మ తల్లి గ్రామదేవత పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని కావున ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరినటువంటి కూనం బ్రహ్మానందరెడ్డి,వారి తమ్ముడు కూనం రాఘవరెడ్డి వారి కుటుంబ సభ్యులను గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతరకు వారి కుటుంబాలను గ్రామదేవత జాతర దూరం పెట్టే విధంగా వ్యవహరిస్తూ నిష్టారాజ్యంగా గంగమ్మ జాతరను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయటం స బాబు కాదు కావున గ్రామ దేవత జాతర అంటే ఒకే కులానికి చెందిన జాతర కాదు గ్రామంలోని కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా చేసుకోవలసిన పండుగ కనుక రాజకీయము చేయకుండా రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వైసీపీ నాయకులు ఇలా చేయడం మంచి పరిణామం కాదని అందరినీ కలుపుకొని అందరితో సంప్రదింపులు చేసి గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతరను అంగరంగ వైభవంగా జరుపుకునే విధంగా కొంత సమయము లేటు అయినా గ్రామంలోని గ్రామ ప్రజలందరికీ సంప్రదింపులు చేసి గ్రామ దేవత పండుగను చేసుకునే విధంగా ఉండాలి కానీ రాజకీయ రంగులను గ్రామ ప్రజలపై రాజకీయము చేయకండి గ్రామంలోని గ్రామ ప్రజలందరూ గురువారం నాడు బ్రహ్మానందరెడ్డి దగ్గర రాఘవరెడ్డి తల్లి కూనం ఈశ్వరమ్మ మరియు కముజుల సుబ్బారెడ్డి, కూనం తాతిరెడ్డి, చీరే లక్ష్మారెడ్డి, సూరే వెంకటరామిరెడ్డి, కముజుల కృష్ణారెడ్డి, సూరే లింగారెడ్డి, బండి తిరుపతిరెడ్డి, తెల్లపాటి ఆదినారాయణ, సూరే వెంకటరామిరెడ్డి, కూనం ఆదిరెడ్డి, గూడూరు రాజేందర్ రెడ్డి, చీరే రాఘవరెడ్డి, పసుపులేటి మనోహర్ మరికొందరు కులాలకు అతీతంగా గ్రామ నాయకులు సమావేశం ఏర్పాటు చేసి బద్దిపూడి గ్రామంలో రాఘవరెడ్డి మరియు బ్రహ్మారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులుగా చలామణి అవుతున్నారని వారి ఎదుగుదలను చూసి ఓర్వలేని వైఎస్ఆర్సిపి నాయకులు కందుకూరు వైఎస్ఆర్సిపి నాయకులు మాటలు వింటూ గ్రామంలో గంగమ్మ జాతరను రాజకీయ జాతరగా చేస్తూ ప్రతి ఇంట్లో ఓ తలకాయికి 600 రూపాయల చొప్పున వసూలు చేస్తున్న క్రమంలో కొంతమంది గ్రామ నాయకులు అందరూ కలిసికట్టుగా చేసుకోవలసిన గ్రామదేవత గంగమ్మ జాతరను ఏకపక్షంగా చేయటం సబాబు కాదని కావున అందర్నీ కలుపుకొని పోవాలని అంటే వారు సహకరించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో కమిటీగా చలామణి అవుతున్న 14 మందిపై ఉలవపాడు పోలీస్టేషన్లో స్థానిక ఎస్సై కి మరియు కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కు బద్దిపూడి గ్రామదేవత గంగమ్మ జాతర విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లి ఎటువంటి సమస్యలు లేకుండా గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా కులమతాలకు అతీతంగా గంగమ్మ జాతరను జరుపుకోవాలని వారికి వివరించారు. ఆ విషయాన్ని వారు అంగీకరించి మరల ఇక్కడ రాజకీయం చేస్తూ మా ఇష్టం ఏం చేస్తాం ఎవరి అనుమతులు మాకు అవసరం లేదు మేము పోలీస్ స్టేషన్లో ఉన్న గ్రామ ప్రజలు చేస్తారని చెప్పటం చాలా బాధాకరమైన విషయం మన గ్రామం మన గ్రామ దేవత గంగమ్మ జాతర ఇప్పుడు కాకపోయినా మరో తారీకులో అందరం కలిసికట్టుగా ఒక్కో ఇంటి ఎన్ని ఎకరాలు ఉన్నాయో ఎకరాకి వెయ్యి రూపాయలు చొప్పున వసూలు చేసి మధ్యతరగతి కుటుంబాలు ఇంటిలో ఒక్కో తలకాయకి 600 రూపాయలు అంటే కష్టంగా ఉంటుంది కనుక ఎవరికి పొలము వుందో ఒక ఎకరాకి వెయ్యి రూపాయలు చొప్పున వసూలు చేసి ఘనంగా గంగమ్మ జాతరను మరో తారీఖున అందరూ అంగీకారంతో గ్రామ ప్రజల ఆమోదంతో గంగమ్మ జాతరను జరుపుకోవాలని నిర్ణయించి గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కులాలకు మతాలకు అతీతంగా అన్ని కులాల ప్రజలు పాల్గొన్నారు.


## 26 నుండి డిగ్రీ అడ్మిషన్ల ప్రారంభం

**డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి కుమార్**




**కందుకూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** కందుకూరు టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) డిగ్రీ రెండవ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ 26 నుండి ప్రారంభమవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 26 నుండి 29 వరకు విద్యార్థులు తమ సర్టిఫికెట్స్ తో కళాశాల కు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలియజేశారు.బి.ఎ. నందు ఎకనామిక్స్ , పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఇంగ్లీష్, బీ.కాం.నందు కంప్యూటర్ అప్లికేషన్స్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సెక్టార్ అండ్ ఇన్స్యూరెన్స్ (అప్రెంటిస్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్) మరియు బి.యస్సీ.నందు మేథమాటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటని కోర్సులున్నాయని, తమ కళాశాలలో అత్యున్నత నైపుణ్యం గల అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని మరియు అత్యున్నత స్థాయి వసతులు మరియు విద్యా బోధన అందిస్తామని, కావున కందుకూరు మరియు పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు చేరవలసిందిగా కోరడమైనది.

## కాత్యాయనీ దేవి అవతారంలో దర్శనం ఇచ్చిన అంకమ్మ తల్లి



**కందుకూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి**

కందుకూరు గ్రామదేవత ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో దేవి శరన్న వరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. నాల్గవ రోజు భక్తులకు కాత్యాయనీ దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ఉదయం పంచామృత అభిషేకం, కుంకుమ పూజ అష్టోత్తరం, సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. అమ్మవారిని కన్నుల పండుగ అలంకరించారు. డబ్బుగొట్టు మల్లికార్జునరావు, అత్తంటి వసంతరావు, కాపులూరి మురార్జీ, పెరుగు ప్రసాద్, అప్పనబోయిన రాజేష్ ఉభయ దాతలుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కార్తీక్, భక్తులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం






**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ఆనందమని, ప్రజలు తమ పరిసరాల పరిశుభ్రత పై బాధ్యత కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతహి సేవ 2025లో భాగంగా "ఏక్ దిన్..ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమం లో భాగంగా గురువారం కనిగిరి పట్టణంలోని తహసీల్దార్,రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వద్ద నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 10 రోజుల పాటు శ్రమదానం కార్యక్రమం నిర్వహించి పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండగలమని,అభివృద్ధికి సాధ్యమవుతుందన్నారు. సచివాలయ శానిటరీ సెక్రెటరీ లు ప్రజలతో సమన్వయం చేసుకుని సానిటేషన్ డ్రైవ్ నిర్వహించామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అందరి బాధ్యతగా ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాలు,చర్చిలు, మసీదుల వద్ద కూడా పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనవసరమైన వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడం, వ్యర్థాల నుండి సంపద సృష్టి చేయడం ద్వారా మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ప్రతి రోజూ ఏర్పడే చెత్తలో సుమారు 50 శాతం బాధ్యత లేకుండా ప్రజలు పడవేసినవే ఉంటాయన్నారు.పార్కులు, బస్ స్టాండ్, మార్కెట్ లు, పుర వీధులలో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్ లు, బిస్కట్,చాక్లెట్ కవర్ లు,ఇలా చెత్తను భాధ్యత లేకుండా పడేస్తున్నారని,దీని కారణంగా పారిశుధ్య కార్మికులు ప్రతి రోజూ సమస్యలను ఎదుర్కొంటున్నారని, పని భారం పెరుగుతుందన్నారు. నాగరికులుగా సమాజంలో పారిశుద్ధ్యం పై ప్రజలు కొంచం దృష్టి పెట్టి చెత్త బుట్టలను వాడడం ద్వారా పారిశుధ్య కార్మికులకు సహాయంగా ఉంటుందన్నారు.స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా కాలనీలు,వీధులలో మొక్కలను నాటాడడం ద్వారా పచ్చదనం పెరుగుతుందని,వాతావరణం చల్లబడుతుం దని, ఆరోగ్యమైన వాతావరణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్ సచివాలయం శానిటరీ సెక్రటరీలు టీడీపీ పట్టణ అధ్యక్షులు ఫిరోజ్ కూటమి నాయకులు పారిశుధ్య కార్మికులు స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు







**కందుకూరు, ప్రజలకి చేరువ :** రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ యువతకు కొత్త భవిష్యత్తు వైపు మార్గం సుగమం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవాడ సచివాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ విజేతలకు స్వయంగా నియామక పత్రాలు అందజేస్తూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు రాష్ట్ర మంత్రులు సహచర శాసనసభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కందుకూరు నియోజకవర్గానికి చెందిన డీఎస్సీ విజేతలకు నియామక పత్రాలను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. నియామక పత్రాలు అందుకున్న విజేతలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఎరువుల పంపిణీ ప్రారంభించిన బొద్దులూరి

**కొండిపి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** కొండపి మండలం పరిధిలోని చోడవరం గ్రామ సొసైటీ లో ఎరువుల పంపిణీ కార్యక్రమం ను సొసైటీ అధ్యక్షులు బొద్దులూరి లక్ష్మీ ప్రసన్న గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండపి మండల వ్యవసాయ అధికారి ఎం మాల్యాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ చోడవరం సొసైటీ పరిధిలో ఉన్న చోడవరం, ముప్పవరం, మిట్టపాలెం, గోగినేనివారిపాలెం, చిన వెంకన్నపాలెం, వెన్నూరు, కట్టుబడిపాలెం, కె. ఉప్పలపాడు గ్రామాల రైతులకు చోడవరం సొసైటీ ద్వారా కావలసిన ఎరువులను పంపిణీ చెయ్యడం జరుగుతుందని చెప్పారు. సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతూ చోడవరం సొసైటీ ద్వారా రైతులకు కావలసిన ఎరువులను అందరికీ అందుబాటులో ఉండేలా సొసైటీ అధ్యక్షులుగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెంబర్లు రావిపాటి నారాయణ, కమ్మ వెంకటేశ్వర్లు, సొసైటీ సీఈఓ డి నాగార్జున,చోడవరం గ్రామ నాయకులు రాఘవ సొసైటి పరిధిలోని గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## తెలుగు జాతికి జీవం జానపదం

**టిఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం రవికుమార్**



**కందుకూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగము, కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ బడ్డాయి. ఇందులో భాగంగా విద్యార్థునులచే కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండుగగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ జాతికి జీవం జానపదం, ప్రపంచంలోని ప్రతి జాతికి తనదైన ఒక సంస్కృతి ఉంటుందని అందులో జానపద కళారూపాలు ఒక భాగం అని కోలాటం వంటి కళారూపం మన తెలుగువారి సంస్కృతిలో భాగమని తెలియజేశారు. మహిళా సాధికారత విభాగ కన్వీనర్ డాక్టర్ కొమ్మనబోయిన సుజాత మాట్లాడుతూ ఒకప్పుడు దసరా శ్రీరామనవమి వంటి పండగ రోజుల్లో కోలాటం, పగటి వేషాలు, తప్పెటగుళ్ళు వంటి జానపద కళారూపాలెన్నో ప్రదర్శించబడేవని గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర ఏడుకొండలు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రాజగోపాల బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వి. శ్రీహరి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ కె.వి పద్మావతి, డాక్టర్ ఐ. అనూష , ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## బోల్డ్ అవతారంతో రియాలిటీ బ్యూటీ

రియాలిటీ షోలతో మంచి పేరు తెచ్చుకుంది షామా శికందర్. యే మేరీ లైఫ్ హై ఈ బ్యూటీకి మంచి పేరు తెచ్చిన సంగతి తెలిసిందే. బుల్లితెర, వెండితెర రంగంలో కెరీర్ సాగిస్తున్న ఈ బ్యూటీ విదేశీ ప్రియుడు జేమ్స్ మిల్లిరోన్ తో రొమాంటిక్ డేట్ లో ఉన్న సంగతి తెలిసిందే. షామా నిరంతర ఫోటోషూట్లు, వీడియో షూట్లతో సోషల్ మీడియాల్లో భారీ ఫాలోయింగ్ పెంచుకుంది. ముఖ్యంగా ఈ బ్యూటీ బోల్డ్ ఫోటోషూట్లకు విపరీతమైన స్పందన వస్తోంది. ఇటీవల వరస ఫోటోషూట్‌లతో అగ్గి రాజేస్తున్న ఈ బ్యూటీ తాజాగా మరో బోల్డ్ ఫోటోషూట్ ని షేర్ చేయగా అది ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. భర్త మిల్లిరాన్ తో కలిసి ఓ ఫ్యాషన్ ఈవెంట్ కి అటెండయిన షామా ఈ స్పెషల్ యూనిక్ ఫోటోషూట్ తో రెచ్చిపోయింది. గుర్తుంచుకోవాల్సిన సాయంత్రం! అంటూ షామా ఈ ఫోటోషూట్ ని ఇన్ స్టాలో షేర్ చేసింది.



## రామ్ చరణ్‌కు బాలీవుడ్ ఆఫర్?

తమిళ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ చేసిన గేమ్ ఛేంజర్ ఎన్నో అంచనాలతో వచ్చి డిజాస్టర్ అయింది. మెగా ఫ్యాన్స్ ఆశలన్నింటి పైనా గేమ్ ఛేంజర్ నీళ్లు చల్లింది. రామ్ చరణ్ మాత్రం గేమ్ ఛేంజర్ రిజల్ట్ ను పక్కన పెట్టేసి తన తర్వాతి సినిమా కోసం రెడీ అయిపోయి, ఆల్రెడీ దానికి సంబంధించిన షూటింగ్ ను కూడా మొదలుపెట్టాడు. చరణ్ తన తర్వాతి సినిమాను ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో చేయనున్న విషయం తెలిసిందే. చరణ్ కెరీర్ లో 16వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా షూటింగ్ ను ఈ ఏడాది చివరకు పూర్తి చేయాలని బుచ్చిబాబు ప్లాన్ చేసుకున్నాడు.




## అనన్య చిల్ మూమెంట్

'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' సినిమాతో బాలీవుడ్‌లో పరిచయం అయిన ముద్దుగుమ్మ అనన్య పాండే. బాలీవుడ్ నటుడు చుంకీ పాండే వారసురాలిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన అనన్య పాండే తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుంది. మొదటి సినిమాతోనే నటిగా మంచి పేరు సొంతం చేసుకున్న అనన్య పాండే ఆ తర్వాత వరుసగా సినిమాలు చేస్తూ వస్తోంది. 2022లో విజయ్ దేవరకొండకు జోడీగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'లైగర్' సినిమాలో నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. తనకు ఇష్టం లేకుండానే ఆ సినిమాలో నటించాను అంటూ ఇటీవల ఒక ఇంటర్వ్యూల అనన్య పాండే చెప్పి అందరిని సర్‌ప్రైజ్ చేసింది. లైగర్ ఫ్లాప్ కావడంతో సౌత్ సినిమాలపై అనన్య ఆసక్తి చూపించడం లేదు.

## అఖిల్ మాస్!



పుష్ప తర్వాత అల్లు అర్జున్ చేస్తున్న అట్లీ డైరెక్షన్ సినిమా మీద అంచనాలు హై రేంజ్ లో ఉన్నాయి. ఈ సినిమాను సన్ పిక్చర్స్ యానర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. సినిమా అనౌన్స్ మెంట్ వీడియోతోనే ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేశాడు అట్లీ. ఇదేదో పాన్ ఇండియా కాదు పాన్ వరల్డ్ సినిమాగా వచ్చేలా ఉందని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు. అట్లీ ఈ సినిమాలో ప్రతి అంశాన్ని ఎంతో ప్లానింగ్ తో చేస్తున్నాడు. హై టెక్నికల్ స్టాండర్డ్స్ తో ఈ సినిమా వస్తుంది. అందుకే సినిమాలో కొన్ని ఎపిసోడ్స్ కొన్నేళ్లు గుర్తుండిపోయేలా చేస్తున్నారట. ఈ ఎపిసోడ్ చెప్పే అల్లు అర్జున్ ని ఒప్పించారా.. అట్లీ అల్లు అర్జున్ కాంబో సినిమాలో స్పెషల్ యాక్షన్ సీక్వెన్స్ ఒకటి ప్లాన్ చేస్తున్నారట. ఇది సినిమా హైలెట్ సీన్స్ లో ఒకటని తెలుస్తుంది. ఈ సీన్ లో అల్లు అర్జున్ గెటప్ వేరే లెవెల్ అని టాక్. అట్లీ ఈ ఎపిసోడ్ చెప్పే అల్లు అర్జున్ ని ఈ సినిమాకు ఒప్పించాడని టాక్. సినిమాలో కీలకమైన ఈ స్పెషల్ యాక్షన్ సీన్ ని ఎంతో జాగ్రత్తగా చేస్తున్నారట. అల్లు అర్జున్ ఇమేజ్ మరింత పెంచేలా గ్లోబల్ లెవెల్ లో రీచింగ్ వచ్చేలా ఈ సినిమా చేస్తున్నారట.ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా దీపిక పదుకొనె ఫిక్స్ అయ్యింది. సినిమాలో ఆమె రోల్ కూడా చాలా బాగుంటుందని టాక్. దీపికా మాత్రమే కాదు మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్న కూడా ఈ ప్రాజెక్ట్ లో భాగం అవుతారట. పుష్ప సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అల్లు అర్జున్ అట్లీతో సినిమా ఆ నెక్స్ట్ లెవెల్ అనిపించేలా చేయాలని చూస్తున్నారు. అట్లీ అయితే అల్లు అర్జున్ డెడికేషన్ కి షాక్

PRINTED,PUBLISHED AND OWNED BY NARALA MURALI PRINTED AT SUNDAY PRINTING PRESS, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. AND PUBLISHED FROM H NO. 5-212-4, KOTTURU , KANIGIRI, PRAKASAM, ANDHRA PRADESH - 523230 RNI NO : APTEL 2020/80178. CELL : +91 891 934 5606 EDITOR : KUMAR